తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కడపఅర్బన్ : సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలో స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రయివేటు పాఠశాలు, కళాశాలలు ప్రత్యేక క్లాసుల పేరుతో విద్యా సంస్థలు నడుపుతున్నారని చెప్పారు. ఎవరైతే విద్యా సంస్థలు నడుపుతారో వారిని ఎస్ఎఫ్ఐ బృందం కచ్చితంగా అడ్డుకుంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవులను అన్ని విద్యా సంస్థలకు ఇవ్వాలని, ఉల్లంఘించిన విద్యా సంస్థలపైన జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తనిఖీలు చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

నందిరెడ్డి శివపార్వతి

నందిరెడ్డి తేజేశ్వర్‌రెడ్డి

జి.మారుతి ప్రసాద్‌రెడ్డి

ఒకరికి తీవ్ర గాయాలు
పెండ్లిమర్రిలో విషాదఛాయలు

ప్రజాశక్తి-పెండ్లిమర్రి (కడప అర్బర్)

కడప జిల్లాలో పిడుగుపాటుకు ముగ్గురు మృతి చెందిన ఘోర సంఘటన చోటుచేసుకుంది. పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు పొలాల్లో జరిగిన ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో జిల్లాలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులు భయభ్రాంతులకు గురిచేశాయి. ఈ ఉరుములు, మెరుపుల సమయంలో పడిన పిడుగు పాటుకు వ్యవసాయ పనులు, పశువులు కాసుకునేందు కోసం వెళ్లిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయాలతో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తుమ్మలూరు గ్రామానికి చెందిన ముగ్గురు, పగడాలపల్లెకు చెందిన ఒకరు పిడుగుపడే సమయంలో తుమ్మలూరు సమీపంలోని పొలాల్లో ఉన్నారు. వ్యవసాయ పనుల కోసం ఇద్దరు, పశువులు తోలుకొని ఇద్దరు రోజువారీలాగే వెళ్లారు. ఒక్కసారిగా సంభవించిన పిడుగుపాటుకు పశువుల తోలుకవెళ్ళిన నందిరెడ్డి శివపార్వతి(30) ఆమె మరిది కుమారుడు ఆరవ తరగతి చదువుతున్న నందిరెడ్డి తేజేశ్వర్‌రెడ్డి(10), పగడాలపల్లి గ్రామానికి చెందిన జి.మారుతి ప్రసాద్‌రెడ్డి(30) అక్కడికక్కడే పిడుగుపాటుకు మృత్యువాత పడ్డారు. వీరితోపాటు నాగాయపల్లెకు చెందిన కర్ణాటి నరేష్ కుమార్‌రెడ్డి అనే వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఈయన్ను కడపకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. రోజువారి వ్యవసాయ పనుల కోసం, పశువుల మేపుకునేందుకు వెళ్ళి నవారు పిడుగుపాటుకు మృతి చెందిన సమాచారం తెలియడంతో తుమ్మలూరు గ్రామంలో తీవ్ర విషాద చాయలు నెలకొన్నాయి. మృతి చెందిన వారిలో నందిరెడ్డి శివపార్వతి, నందిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మృతదేహాను వారి స్వగ్రామమైన తుమ్మలూరుకు తరలించగా, మారుతి ప్రసాద్‌రెడ్డి మృతదేహాన్ని తన స్వగ్రామమైన పగడాడాల పల్లెకు తరలించారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

- కడప ఉక్కు పనులు ప్రారంభించాలి
- ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నాలో రైతు, కార్మిక సంఘాల నాయకుల డిమాండ్

నిరసనలో రైతు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, వెనుకబడిన ప్రాంతాలకు విభజన చట్టం హామీలు అమలు చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కడప ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట వామపక్ష కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు బి.దస్తగిరిరెడ్డి, అధ్యక్షులు ఎమ్మి సుబ్బారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ మాట్లాడుతూ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ ఉక్కు ప్రయివేటీకరించడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రయివేటీకరణ ఆపాలని 1315 రోజులుగా విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోనూ పోరాటంసాగిస్తున్నా, ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెడుతూ మోడీ ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకే పరిశ్రమ దారదత్తం చేయడానికి కంకణం కట్టుకుని పొమ్మనకుండా పొగపెట్టే పనులు చేస్తున్నదని విమర్శించారు. 3వ సారి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రయివేటీకరణ పనుల్ని వేగవంతం చేస్తుందని పేర్కొన్నారు. దీన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పరిశ్రమ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాలకు విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు రెడ్డి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి లేవాకు నాగ సుబ్బారెడ్డి, కార్మిక సంఘాల నాయకులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, బాదుల్లా, రైతు సంఘం నాయకులు బాలచంద్రయ్య, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : సిపిఎం

ధర్నా చేస్తున్న కాలనీ వాసులు, నాయకులు

ప్రజాశక్తి-బద్వేలు

సుందరయ్య కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను డిమాండ్ చేశారు. గురువారం పూసలవాడ సచివాలయం దగ్గర సుందరయ్య కాలనీ ప్రజలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం కాలనీ ఏర్పాటైందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొన్ని ఇళ్లకు మాత్రమే డోర్ నెంబర్లు వేశారని మరికొన్ని ఇళ్లకు డోర్ నెంబర్లు వేయలేదని తెలిపారు. ఎన్నిసార్లు అధికారకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో వంద ఇళ్లకు పైబడి మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. పొలాలలోకి వెళ్లి నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. మంచినీటి వసతి కల్పించడంలో మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చినా, పోరాటాలు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. పేద ప్రజలు చందాలు పోగేసుకొని పైప్ లైన్స్ వేసుకుంటే మున్సిపాలిటీ అధికారులు కనెక్షన్ ఇవ్వడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ కనెక్షన్ ఇవ్వమని చెప్తే పూసలవాడ సచివాలయం సిబ్బంది కిషోర్ అడ్డుపడుతున్నాడన్నారు. కమిషనర్‌కి లేనిపోని మాటలు చెప్పి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని అలాంటి అధికారిని విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. తక్షణం తాగునీటి సమస్య పరిష్కరించకుంటే అధికారులను అడ్డుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ముడియం చిన్ని, మోక్షమ్మ, కైరున్ బి.రామలక్ష్మమ్మ, ఫాతిమా, మాధవి, దేవి, చంద్రకళ, స్వీటీ, అరుణ, రమాదేవి, ఎస్.కె ఆదిల్, ఖలీల్, జోషి, చంద్రశేఖర్, గోవర్ధన్, రవి, గంప సుబ్బరాయుడు, బాలస్వామి, సుబ్బయ్య పాల్గొన్నారు.

బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

రూ.1.80 కోట్లు విలువైన ఫోన్లు అందజేశాం

- ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రజలు తెలిసి తెలియకో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను పోలీస్ శాఖ రికవరీ చేసి బాధితులకు అప్పగించిందని, బాధితులకు మొబైల్ ఫోన్లు అప్పగించడంలో రాష్ట్రంలోనే తొలి స్థానంలో జిల్లా పోలీసులు నిలిచామని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. గురువారం పోలీస్ పెన్నార్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 555 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. వీటి విలువ రూ.1.80 కోట్లు ఉంటుందని చెప్పారు. కడప జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్‌వర్క్ నిఘా, డేటా విశ్లేషణా పద్ధతులు ఉపయోగించి భారీ మొబైల్ ఫోన్ రికవరీ ఆపరేషన్‌లో సఫలమయ్యారని తెలిపారు. సిఇఐఆర్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా మొబైల్ ఫోన్లు రికవరీ చేశామని చెప్పారు. ఇప్పటి వరకు 5 విడతల్లో మొత్తం రూ.7.4 కోట్లు విలువైన 4068 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామని పేర్కొన్నారు.కడప సైబర్ క్రైమ్ సిఐ మధుమల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్ల రికవరీకి సంబంధించిన డిజిటల్ ఫోరెన్సిక్స్ ఆధారిత నిఘా పద్ధతులు ప్రయోగించామని పేర్కొన్నారు.

హోంగార్డు కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి-కడప అర్బన్

కమలాపురం పోలీసుస్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ జులై 6న రామాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు పి.ఆంజనేయులు నాయక్ (హెచ్‌జి 2083) కుటుంబానికి రూ.30 లక్షల ప్రమాద బీమా మొత్తాన్ని చెక్కు రూపంలో ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు అందజేశారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డు తల్లి పి.ధార్మికి చెక్కును అందించారు. హోంగార్డు కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే హోంగార్డు రోడ్డు ప్రమాదంలో అకాల మరణం పొందడం బాధాకరమన్నారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, యాక్సిస్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలు, గర్భిణులకు టీకాలు

ప్రజాశక్తి-కలసపాడు: మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేశామని విలేజ్ హెల్త్ క్లినిక్ అధికారి శ్రీను తెలిపారు. హెల్త్ సెంటర్‌లో 14 రకాల ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 105 రకాల మందులు అన్ని రకాల వ్యాధులకు ఉన్నా యని, తెలిపారు. అత్యవసర సమయాలలో ప్రజలందరికీ అందుబాటులోనే ఉండి తగిన సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతినెల మూడో తేదీన రొటీన్ వ్యాక్సిన్స్ వేయడం పట్ల గర్భిణులకు, చిన్నారి పిల్లలు, రోగులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జి.సావిత్రి, నవరత్నమ్మ, ఎంపిహెచ్ఎ జి.వెంకటసుబ్బయ్య, 104 డిఇఒ, ఆసిఫ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ వైద్య కళాశాల దినోత్సవం

ప్రజాశక్తి-కడప సిటీ : ఈ నెల 4వ తేదీ ఐదు గంటలకు కళాశాల స్పోర్ట్స్ ప్రాంగణంలో ప్రభుత్వ వైద్య కళాశాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిమ్స్ మాజీ డైరెక్టర్ సిద్ధప్ప గౌరవ్, గౌరవ అతిథులుగా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జివి.రమాదేవి హాజరవుతున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ డే సందర్భంగా ఆటల పోటీలు, క్రీడా పోటీలను ఉదయం 9 గంటలకు ప్రారంభించేందుకు ముఖ్యఅతిథిగా ఎఎస్‌పి కెప్రకాష్ బాబు హాజరవుతున్నట్లు తెలిపారు.

విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నూతన కులసచివులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన, పరిశోధన, విస్తరణ అనే ప్రధాన సూత్రాలను అమలు చేస్తానన్నారు. విశ్వవిద్యాలయ ప్రారంభం నుంచి ఇక్కడే పని చేస్తున్న దృష్ట్యా సంస్థపై సంపూర్ణ అవగాహన ఉందని తెలిపారు. బాధ్యతలు తీసుకున్న సందర్భంగా వైవీయూ విసి ఆచార్య కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, సభ్యులు, శాఖధిపతులు, అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్లు, ఆలుమ్ని అసోసియేషన్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, స్కాలర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని కళాశాలల కరస్పాండెంట్ అసోసియేషన్, ప్రతినిధులు, కళాశాల కరస్పాండెంట్లు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు నూతన రిజిస్ట్రార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కడప బెటాలియన్ అసిస్టెంట్ కమాండింగ్ ఆఫీసర్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధారాణి, అనంతపురం ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య బాలసుబ్రమణ్యం, మొల్ల సాహిత్య పీఠం ఫౌండర్ హనుమంతరావు, కమలాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికను రూపొందించండి

- కలెక్టర్ లోతేటి శివశంకర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - కడప

స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 ఆశయ సాధనలో భాగంగా ఐదేళ్ల (2024-29) జిల్లా విజన్ ప్లాన్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు, రైతులను కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా విజన్ ప్లాన్ ప్రణాళిక రూపకల్పనపై కలెక్టర్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, సిపిఒ వెంకట్రావులతో కలిసి అన్ని ప్రజాప్రతినిధులు, రాజకీయవేత్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ఎన్జీవోలు, అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూర దృష్టితో విజన్ ఆంధ్ర-2047 తీసుకువచ్చారన్నారు. ప్రతి జిల్లాలోని కీలక రంగాలపైన దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పన చేసుకుని రానున్న ఐదు సంవత్సరాల్లో జిల్లాను అన్ని అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు మండల మండలన స్థాయిలో విజన్ ప్లాన్ కోసం ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలోని 36 మండలాలు, ఏడు మున్సిపాలిటీ, కడప కార్పొరేషన్‌లో జిల్లా విజన్ ప్లాన్‌పై సేకరించిన ఫీడ్ బ్యాక్ ప్రక్రియకు జిల్లాలో అన్ని రంగాల ప్రజల నుండి అనూహ్యమైన స్పందన వచ్చిందని పేర్కొన్నారు. ప్రతి రంగంలో 15 శాతం గ్రోత్ రేటింగ్‌ను నిర్దేశించుకోవాలన్నారు. జిల్లాలో దేశ ప్రఖ్యాతి గంతించిన పరిశ్రమలు ఉన్నాయని, ప్రఖ్యాత ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ కల్గిన కొప్పర్తి పారిశ్రామికవాడ పారిశ్రామిక ప్రగతికి సోపానాలు కానున్నాయన్నారు. జిల్లాలో సోలార్, విండ్ వంటి రెన్యువల్ ఎనర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో హార్టికల్చర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉన్నందున ఆదిశగా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో అపారమైన ఖనిజ నిధులు ఉన్నందున వాటి వృద్ధికి ఆర్థిక ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జిల్లాలోని టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి గండికోటకు అంతర్జాతీయ స్థాయి శోభ తీసుకురావాలన్నారు. జిల్లాలో దాదాపు 30 శాతం అటవీ అడవులు విస్తరించి ఉండటంతో వాటి నుంచి ఎకో టూరిజం ద్వారా ఆదాయ వనరులు సమకూరేలా ప్రణాళికల రూపొందించాలన్నారు. ప్రజాప్రతినిధులు రైతులు, జిల్లా ప్రముఖులతో సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు సూచనలు తీసుకొని జిల్లా ప్రణాళికలో పొందుపరుస్తామన్నారు. విద్యా సంస్థలలో విజన్ ఆంధ్ర-2047 కాంపిటీషన్స్ కండక్ట్ చేయడం జరిగిందన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ జిల్లా విజన్ ప్రణాళికలో నైపుణ్యాభివృద్ధి, రూరల్ డెవలప్మెంట్, ప్లానింగ్, అగ్రికల్చర్, సర్వీస్ సెక్టార్ వంటి రంగాలలో అనుభవం ఉన్న యువత, విద్యార్థులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లాకు నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన కోసం ప్రతిఒక్కరు సమన్వయంతో సమర్ధవంతంగా పనిచేయాలన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధి, తలసరి ఆదాయం పెంచేలా కీలకమైన శాఖలన్నీ సహాయ సహకారాలు అందిపుచ్చుకుని ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం సమావేశానికి హాజరైన బిసి సంఘ నేత అవ్వారు మల్లికార్జున, హ్యూమన్ రైట్స్ ఆక్టివిస్ట్ జెవి.రమణ, నేచురల్ ఫార్మింగ్ రైతు మామిడి సుబ్బరాయుడు, ఎన్జీవో శివారెడ్డి, ఎన్జీవో పెంచలయ్య, డిక్కీ కో-ఆర్డినేటర్ శివశంకర్, ఇండస్ట్రియల్ అసోసియేషన్ చైర్మన్ శేషారెడ్డి, పలువురు రైతులు వారివారి సలహాలు, సూచనలను కలెక్టర్ వారికి తెలియజేశారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ వెంకటపతి, డిపిఒ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ సురేష్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఇఒ అనురాధ, డ్వామా పీడీ జోయల్ విజయ్ కుమార్, పిఆర్ ఎస్ఇ శ్రీనివాసులురెడ్డి, ఇతర జిల్లా అధికారులు, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి : యుటిఎఫ్

సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు తక్షణమే 12వ పిఆర్‌సిని ఏర్పాటు చేయాలని, పిఆర్‌సి అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం యుటిఎఫ్ భవన్‌లో చెన్నూరు, ఖాజీపేట, కమలాపురం, వల్లూరు మండలాల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో పిఆర్‌సి విషయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం చోటుచేసుకుందని తెలిపారు. 12వ పిఆర్‌సి అమలులో సైతం కమిషన్‌ను నియమించి కాలయాపన చేశారే తప్ప, విధివిధానాలను రూపొందించి అమలు చేసిన పాపాన పోలేదన్నారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరించి, ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక ప్రయోజనాలను పూర్తిగా అడ్డుకుందని తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ డాక్టర్ మన్మోహన్ సింగ్ కమిషన్ బాధ్యతలకు రాజీనామా చేసినందున, నూతన కమిషన్‌ను నియమించాలని, పిఆర్‌సి అమలులో జాప్యం జరిగే అవకాశం ఉన్నందున, జాప్యం కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు నష్టపోకుండా తక్షణమే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటిచాలని కోరారు. గత ప్రభుత్వ విధానాల ఫలితంగా 11వ పిఆర్‌సిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని 12వ పిఆర్‌సిలో మెరుగైన ఫిట్మెంట్ ప్రకటించాలన్నారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లించకుండా తీవ్ర వేధింపులకు గురిచేసిందని పేర్కొన్నారు. జిఒ 117ను రద్దు చేస్తామని గత ఎన్నికలకు ముందు ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు తక్షణం జిఒ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, కోశాధికారి కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహ్మద్, కె.చెన్నయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన శివకొండారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్ : విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని స్వగృహం వద్ద నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి మర్యాదపూర్వక కలిశారు. కడపలో ఐదేళ్లలో నుంచి పార్టీ విజయం కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను మంత్రి అభినందించారని తెలిపారు. కార్య కర్తలను, నియోజకవర్గ నాయకులను పార్టీ తగిన రీతిలో గౌరవి స్తుందని తెలిపారు. కడప నగరకమిటీని ప్రత్యేకంగా అభినందించారు. కడపలో పర్యటించలని లోకేష్‌ను శివ కొండారెడ్డి కోరగా తప్పకుండా వస్తానని చెప్పారు.

అపుస్మా జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కడప అర్బన్ : అపుస్మా నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా 3వ సారి బి.గంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగార్జున మోడల్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.శివ శంకర్‌రెడ్డి, కోశాధికారిగా నాగ సుబ్బారెడ్డి (శ్రీ భాష్యం) 40 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

టెట్ పరీక్షకు 148 మంది గైర్హాజర్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో టెట్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటిరోజు రెండు సెషన్లలో 1490 మందికి గాను 1342 మంది హాజరయ్యారు. 148 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని డిఇఒ అనురాధ తెలిపారు.

పెండింగ్ బకాయిల వసూళ్లకు చర్యలు : ఎస్ఇ

ప్రజాశక్తి-కడప

ఉమ్మడి వైయస్సార్ జిల్లాలో విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని, బకాయిలు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్లను వెంటనే తొలగించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ అధికారులను ఆదేశించారు. గురువారం కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేసి మరొక నెల రోజులు గడువిచ్చి బిల్లు కట్ట మంటుందని తెలిపారు. రెండు నెలల గడువు వినియోగదారానికి ఇస్తుందని, విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దన్నారు. బకాయిలు వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలు చెల్లించని వారి విద్యుత్ కనెక్షలను తొలగించాలని ఆదేశించారు. నెలవారి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. నిర్లక్ష్య ధోరణి వీడండి లైన్ల వెంబడి తిరగాలని, తప్పులను గుర్తించాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటు, విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య వంతులు చేసి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కడప ఇఇ హరి నాయక్, డిఇఇలు, ఎఇలు, జెఇలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ఎంఎస్ఎంఇ తరలింపు జిఒ 56ను రద్దు చేయాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి-కడప : ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్ అమరావతికి తరలింపు జిఒ 56ను రద్దు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌అండ్‌బి బంగ్లాలో వైసిపి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యం, కిషోర్ అఖిపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ కొప్పర్తి పారిశ్రామికవాడలో 50 రకాల పరిశ్రమలు ఉత్పత్తి చేస్తున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎంఎస్ఎఇ సెంటర్‌ను అమరావతికి తీసుకుపోవడం సరికాదన్నారు. నిరుద్యోగ యువతి, యువకులకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలైన యువత అభివృద్ధిని అడ్డుకోవడమేనని తెలిపారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సరి చేసుకోవటానికి జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి ఎంపీ సీట్లపై ఆధారపడి కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మరో స్కిల్ సెంటర్ అమరావతికి టిడిపి ప్రభుత్వం తెచ్చుకోవాలని పేర్కొన్నారు. సెంటర్‌ను తరలించటం టిడిపి కూటమి పార్టీలు సరిదిద్దుకోలేని పెద్ద తప్పు చేస్తుందని, ఇది రాయలసీమ వాసైనా చంద్రబాబు నాయుడు భవిష్యత్తుకు పెద్ద కలంకంగా మారుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్‌బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, అఖిలపక్ష కమిటీ కన్వీనర్ బి.నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి ఎస్.గుర్రప్ప, కాంగ్రెస్ సత్తార్ పాల్గొన్నారు.

'విజ్ఞాన విహారయాత్రను విజయవంతం చేయండి'

ప్రజాశక్తి - కడప : ఎపి దర్శన్ పేరుతో 10వ తరగతి విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్రను విజయవంతం చేయాలని కలెక్టర్ శివశంకర్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాలులో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వినూత్నంగా ప్రభుత్వ పాఠశాలలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఎంకరేజ్ చేసేందుకు దసరా సెలవుల్లో కడప నుండి అరకు దాకా ఎపి దర్శన్ పేరుతో విజ్ఞాన విహారయాత్రను తయారు చేశామన్నారు. జిల్లాలో 500 మంది విద్యార్థులను ఈ విజ్ఞాన యాత్రకు పంపడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలోని 370 పైచిలుకు పాఠశాలల్లో కెజివిపి, ప్రభుత్వ పాఠశాలలు, జడ్పీ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, గురుకుల పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించి ఎంపిక చేశామన్నారు. ఈ యాత్ర శ్రీకాళహస్తి, శ్రీహరికోట, పులికాట్ లేక్, అమరావతి, కొండవీడు, విజయవాడలో అంబేద్కర్ స్టాచ్యూ, బాపు మ్యూజియం, అక్కడి నుండి పోలవరం, కాకినాడ, యానం, ద్వారక తిరుమల అలాగే విశాఖపట్నం ఎస్సిజడ్ గాని, విశాఖపట్నంలోని ఇతర పర్యాటక ప్రదేశాలను చూసుకొని అరకును సందర్శించడం జరుగుతుందన్నారు.

ఫీవర్ సర్వే చేస్తున్న శ్రీనివాసరెడ్డి

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఫ్రైడే డ్రైడే పాటించి ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం పరిధిలోని 6వ వార్డులో ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరెడ్డి సూచించారు. కార్యక్రమం ఎఎన్ఎం ఇందిరమ్మ, ఆశా కార్యకర్త భారతి పాల్గొన్నారు.

డ్రమ్ములలో నిల్వ ఉన్న నీటిని పారవేస్తున్న సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, దోమలు వృద్ధి చెందకుండా, అవి కుట్టకుండా అప్రమత్తంగా ఉండాలని ఆల్లాడుపల్లె హెల్త్ క్లినిక్ సిహెచ్ఓ రాజరాజేశ్వరి సూచించారు. బిసి కాలనీలో గురువారం లార్వా, ఫీవర్ సర్వే చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో జలుబు, దగ్గు వస్తే.. నీటిని కాచి, చల్లార్చి తాగాలన్నారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు వచ్చినప్పుడు వెంటనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. తగిన చికిత్స పొందాలని సూచించారు. బిసి కాలనీలో లార్వాలను తొలగించినట్లు తెలిపారు. అనారోగ్యం కలిగినప్పుడు పోషకాహారం తీసుకోవాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం విజయ కుమారి, ఆశా కార్యకర్త నరసమ్మ, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జగన్ ప్రతిపక్ష పాత్ర పోషించాలి

ప్రజాశక్తి - చాపాడు

జగన్ ప్రతిపక్ష పాత్ర పోషించాలని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను సీఎంగా ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గత అయిదేళ్లలో రాక్షస పాలనను ప్రజలు భరించలేకనే 11 సీట్లు ఇచ్చారన్నారు. అయినప్పటికీ వైసిపి ప్రవర్తనలో మార్పు లేదన్నారు. గతంలో 2019లో అధికారం చేపట్టిన ఏడు నెలల వరకు ఏ ఒక్క పథకం ప్రారంభించలేదనే విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులలోనే మేనిఫెస్టోలో పెట్టిన హామీలలో ముఖ్యమైనవి అమలు చేశారన్నారు. ప్రభుత్వానికి ప్రతిపక్ష నేతగా సలహాలు ఇవ్వాలని సూచించారు.

గ్యాస్ సిలిండర్ పేలి దంపతులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని బోసిరెడ్డిపల్లె గ్రామం ఓ ఇంట్లో ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలిండర్ పేలి దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గురువారం గ్రామానికి చెందిన జయరామరాజు ఆయన భార్య రాజేశ్వరి ఇద్దరూ కూలి పనికి వెళ్లారు. పని ముగించుకుని ఇంటికొచ్చి వంట చేసుకునే క్రమంలో స్టవ్ వెలిగిస్తుండగా మంటలు చెలరేగాయి. దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

గంగిరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ భారతి

ఇసి గంగిరెడ్డికి వైఎస్ భారతి నివాళులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

డాక్టర్ ఇసి గంగిరెడ్డి నాలుగో వర్ధంతి సందర్భంగా గురువారం వైఎస్ఆర్ రాజారెడ్డి ఘాట్‌లో గంగిరెడ్డి సమాధి వద్ద ఆయన సతీమణి సుగుణమ్మ, ఆయన తనయుడు దినేష్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి పూలమాలసి ఘన నివాళులర్పించారు. అక్కడే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప,, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, కోడి రమణ, సారాయిపల్లె ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

సమస్యలు చెబితే స్పందించాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



ఏదైనా సమస్య ఉందని ప్రజలు కానీ, ప్రజాసంఘాల నేతలు కానీ చెబితే వెంటనే స్పందించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాది కాలంగా అనేక మార్లు మున్సిపల్ కార్యాలయ అధి కారులకు తాగునీటి సమస్యపై విన్న వించినా పట్టించుకోలేదని తెలిపారు. అప్పుడే ఆ సమస్య పరిష్కరించి ఉంటే ఇప్పుడు నేతాజీనగర్, కన్నెలూరు కాలనీలో ప్రజలు అస్వస్థతకు గురయ్యే వారు కాదన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని డిఇ బాలమల్లేష్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

887 క్వింటాళ్ల శనగలు మంజూరు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలానికి సంబంధించి 887 క్వింటాళ్ల శనగలు మంజూరయ్యాయని ఎఒ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటా ధర రూ.9,400కాగా, సబ్సిడీ రూ.2,350 పోనూ రైతు వాటా రూ.7,050 చెల్లించాలన్నారు. శనివారం నుంచి పేర్ల నమోదు ప్రారంభిస్తామన్నారు. అవసరమైన వారు తమ భూమి పాసుబుక్, ఆధార్ తీసుకొని ఆర్ఎస్‌కె సిబ్బందిని సంప్రదించాలని ఆమె కోరారు.

క్రైం కార్నర్

ఐదుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ మూలపల్లె గ్రామ సమీపంలో చీకి చెట్ల కింద జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. జూదమాడుతున్న విసయం తెలుసుకుని దాడి చేశామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యనిషేధం అమలు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాజీవ్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ఐద్వా, సిపిఎం నాయకులు

నూతన మద్యం విధానాన్ని రద్దు చేసి, రాష్ట్రంలో పూర్తిస్థాయి మద్యనిషేధం అమలు చేయాలని గురువారం ఐద్వా ఆధ్వర్యంలో రాజీవ్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం మాట్లాడుతూ మద్యం, గంజాయిల కారణంగా మహిళల మీద దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచారాలు, అకృత్యాలు పెద్దసంఖ్యలో జరుగుతున్నాయని నేషనల్ క్రైం బ్యూరో నివేదిక వెల్లడించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. గుజరాత్, బీహార్, మణిపూర్, నాగాలాండ్ రాష్ట్రాల్లో మద్యపాన నిషేధం అమలులో ఉందన్నారు. మద్యం షాపులు ప్రయివేట్‌కు అప్పజెప్పడం వల్ల విచ్చలవిడిగా వ్యాపారం చేస్తారన్నారు. మంచి పాలన అందిస్తామని, మహిళలకు అండగా ఉంటామని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. మహిళా వ్యతిరేక విధానాలు తీసుకోవడం మంచిది కాదన్నారు. ధర్నాకు మద్దతుగా సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు కార్యదర్శి విజయకుమార్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, ఐద్వా ప్రొద్దుటూరు కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, సర్వేశ్వరి, రాములమ్మ, ఝాన్సీ, విజయ, నీతమ్మ, గుర్రమ్మ, పుష్పలత, సిపిఎం నాయకులు చెన్నారెడ్డి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడి

కార్యక్రమంలో పాల్గొన్న ఎడి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రైతులు మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడులను సాధించవచ్చని ముద్దనూరు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య పేర్కొ న్నారు. మండలంలోని కాంబల్లెలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి మాట్లా డుతూ రైతుల అభ్యున్నతికి ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఎఒ శివమోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి చేయాలని సూచిం చారు. మొలక శాతం కట్టుట, విత్తనశుద్ధి పాటించాలన్నారు. ఆరోగ్య వంత మైన విత్తనాలు ఎంచుకోవాలని కోరారు. 25 శాతం రాయితీతో శనగలు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే రిజిస్ట్రేషన్ మొదలు పెట్టనున్నట్లు ఎఒ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ విస్తరణ అధికారి వీరారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామకృష్ణ, శ్రీను, భవనేశ్, రాజీవ్, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు : సహజ సిద్ధమైన వ్యవసాయ పద్ధతులు అనుసరించి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ వెంకట కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని ఒంటిగారిపల్లెలో గురువారం వ్యవసాయ అధికారి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పత్తి, ఉల్లి పంటలను పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకుడు వెంకటరమణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామ సుధ, ముని భూపాలుడు, రైతులు పాల్గొన్నారు.

కలసపాడు : కలసపాడులో గురువారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ జాకీర్ షరీఫ్ రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు గురులక్ష్మి, ఎపి సిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని నాగిరెడ్డిపల్లి, ఇప్పపెంట గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి కె.ఈశ్వర్‌రెడ్డి వరి పొలంలో పాము పొడ తెగులు గుర్తించారు. దీని నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. ఉద్యానశాఖ అధికారి జ్యోతిర్మయి పసుపు పంట పరిశీలించి, ఆకులు తెలుపు రంగులో పాలిపోయి ఉంటే నివారణకు సలహాలిచ్చారు. మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ బోర్లు ఉన్న రైతులు డ్రిప్, స్ప్రింగ్ కలర్లు రాయితీ మీద పెట్టుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌ఛార్జి నీలకంఠ, విహెచ్ఎలు శిల్ప, రేఖ, ఎపిసిఎన్ఎఫ్ స్టాఫ్ రామలక్షుమమ్మ, చెన్నమ్మ, రైతులు పాల్గొన్నారు.

చాపాడు : వరి పంటలో క్రిమి కీటకాలు సోకగానే వ్యవసాయ సిబ్బంది సలహాలు తీసుకుని వెంటనే మందులు పిచికారి చేయాలని ఎఒ మ్యాగీ తెలి పారు. మండలంలోని బద్రిపల్లె, నెర్రవాడ గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ పంటలలో తెగుళ్లు, చీడపీడలు సోకినట్లయితే వెంటనే తమకు సమాచారం ఇస్తే శాస్త్రవేత్తలను పిలిపించి పరిష్కారం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మేకల బాబు, టిడిపి యువ నాయకులు వీరనారాయణ యాదవ్, లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో భారీ కుంభకోణం

హౌసింగ్ ఎఇ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చేతివాటం - సిమెంట్, ఇసుక, కడ్డీలు స్వాహా

ప్రజాశక్తి - ముద్దనూరు

పేదల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా అర్హులైన పేదలకు మంజూరైన పక్కా గృహాలు, జగనన్న కాలనీల నిర్మాణాల్లో భారీ కుంభకోణం జరిగింది. హౌసింగ్ ఎఇ, ముద్దనూరులోని ఓ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ చేతి వాటం ప్రదర్శించి సిమెంట్, కడ్డీలు, ఇసుకలో భారీగా అవినీతికి పాల్పడి రూ.30 లక్షల వరకు ప్రభుత్వ, ప్రజాధనాన్ని స్వాహా చేశారనే ఆరోప ణలున్నాయి. పక్కాగృహాల మంజూరులో హౌసింగ్ ఎఇ, మండల కేంద్రం లోని ఓ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ చేతివాటం ప్రదర్శించారని ఆరోపణలున్నాయి. అనర్హులకు ఇళ్లు మంజూరు చేసి అవినీతికి పాల్పడుతూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారనే చర్చ జరుగుతోంది. అనర్హులకు పక్కాగృహాలు మంజూరు చేసి వారి నుంచి డబ్బులు దండుకున్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయకుండా మోసం చేశారని భాదితులు వాపోతున్నారు. ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలో అధికారులు మూడు లే అవుట్లు కేటాయించారు. మొదటి లే అవుటు ఎంపిడిఒ కార్యా లయం సమీపంలో, రెండవది జమ్మలమడుగు రహదారిలోని శివాలయం సమీపంలో, మూడవది జమ్మలమడుగు రహ దారిలోని కొండ కింద కేటా యించారు. ఈ మూడు లే అవుట్లలోని జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించని అనర్హులకు వేరే ఇళ్ల వద్ద స్టేజ్ ప్రకారం బినామీ వ్యక్తులను పెట్టి తప్పుడు ఫొటోలు తీసి బిల్లులు చేసి లబ్ధి పొందుకున్నారు. సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని హౌసింగ్ ఎఇ సమన్వయంతో ఇంజినీరింగ్ అసిస్టెంట్ లబ్ధిదారులతో కలిసి మోసం చేసి బిల్లులు దండుకున్నారు. ఒకరి పేరు మీద ఇళ్లు మంజూరు చేసి మరొకరికి బిల్లులు పెట్టి సిమెంట్, కడ్డీలు, ఇసుక దోచుకున్నారు. ఇంటి బిల్లుకు వివిధ దశల ప్రకారం జియోటాగ్ చేయాలనే నిబంధనలు పక్కన పెట్టి ఇళ్లు నిర్మించని లబ్ధిదారులకు వేరేవరో ఇళ్ల వద్ద ఫొటోలు తీసి ఎమ్ బుక్ రాసి దొంగ బిల్లులు చేసి కాజేశారు. అసలు ఇళ్లు నిర్మించని బినామీ లబ్ధిదారులకు వేగంగా బిల్లులు పెట్టి వాటాలు పంచు కున్నారు. పాత ఇళ్లకు బిల్లులు చేసి ఇంటికి రూ.20వేలు నుంచి రూ.30వేలు తీసుకున్నట్లు ప్రజల నుంచి ఆరో పణలు వినిపిస్తున్నాయి. అనర్హులైన కొంతమంది ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాన్ని అమ్ముకున్నారు. అలాంటి వారు ఇళ్లు కట్టకున్నా సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్నట్లు బిల్లులు చేసి లబ్ధి చేకూర్చారు. లబ్ధిదారులకు తెలి యకుండా సిమెంటు, కడ్డీలు, ఇసుక ఇష్టానుసారంగా సొంత ఇంటికి తర లించి ఇతరులకు అమ్ముకున్నారు. ఇసుక ఒకరి పేరు మీద (మళ్లీమళ్లీ) ఒక టికి రెండుసార్లు తీసుకొని బ్లాకులో అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. బిల్లు పెట్టేందుకు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారు. లబ్ధిదారులకు తెలియకుండా సిమెంట్ తీసుకుని బయట తక్కువ ధరకు అమ్ము కున్నారు. సిమెంట్, ఇసుక కూపన్లు ఇచ్చేందుకు లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేసి వేధించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. సిమెంట్ నిజమైన లబ్ధి దారులకు బదులు నకిలీ లబ్ధిదారులను పంపి వారి సంతకాన్ని ఫోర్జరీ చేయించి సిమెంట్ బస్తాలు తరలించారు. మరుగుదొడ్ల నిర్మాణాల్లో లబ్ధి దారులను వేధించి రూ.3వేలు వసూలు చేశాడని బాధితులు వాపో తు న్నారు. చెన్నారెడ్డిపల్లెలో నాడు-నేడు కింద మంజూరైన అంగన్వాడీ కేంద్రాన్ని ముద్దనూరులోని ఓ సచివాలయానికి ఎలాంటి సంబంధం లేకున్నా ఇంజినీరింగ్ అసిస్టెంట్ తన బంధువులకు కాంట్రాక్టు ఇప్పించి పనుల్లో జాప్యం చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఆ పనులను నాసిరకంగా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇళ్లు నిర్మించిన లబ్ధిదారులు మామూళ్లు ఇవ్వకుంటే బిల్లులు ఆలస్యం చేసి కార్యాలయం చుట్టూ తిప్పుకునేవాడని లబ్ధిదారులు విలపించారు. నిర్దేశించిన సమయానికి లక్ష్యాన్ని పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరోనా సమయంలో బిల్లులు పెట్టినట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఎఇ చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పక్కా గృహనిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై విచారించి అవినీతికి పాల్పడిన హౌసింగ్ ఎఇ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, లబ్ధిదారులు కోరుతున్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

పక్కాగృహాల్లో జరిగిన అవకతవకలు పరిశీలిస్తాం. ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి, అవినీతికి పాల్పడిన వారిపై విచారిస్తాం. అవినీతి జరిగి ఉంటే చట్టపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- గురు ప్రసాద్, డిఇ హౌసింగ్ జమ్మలమడుగు

సమష్టి పోరాటంతోనే సమస్య పరిష్కారం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కార్మికుల సమష్టి పోరాటంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చి విశాఖ ఉక్కు కార్మికుల సమస్యను పరిష్కరించినట్లు పిసిసి ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 48 గంటల్లో తొలగించిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోకపోతే నిరాహారదీక్ష చేస్తానని తమ అధినేత షర్మిలా ప్రకటించడంతో ఇటీవల ఉద్యోగాల నుండి తొలగించిన 4,290 మంది కాంట్రాక్టు కార్మి కులను మళ్లీ తీసుకుంటామని విశాఖ ఉక్కు కర్మాగారం యాజమాన్యం రాత పూర్వకంగా తెలపడం హర్షణీయమన్నారు. ఇది ఖచ్చితంగా కాంగ్రెస్, షర్మిల విజయంగా ఆయన పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీక్ష, సభ, డిక్లరేషన్ హాస్యాస్పదమని విమర్శించారు. తిరుమలలో అపవిత్రత జరగలేదని టిటిడి ఇఒ శ్యామలరావు చెబుతుండగా.. మరోవైపు అపవిత్రత జరిగిందని పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారన్నారు. ఇందులో పవన్ కరెక్ట్ అయితే ఇఒ వైదొలగాలి, ఇఒ కరెక్టయితే పవన్ రాజీనామా చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసమని పవన్ చెప్ప డం విడ్డూరంగా ఉందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ అంటే.. అపవిత్ర కార్యక్రమాన్ని తన ఇంటి నుండే ప్రారంభించాలి కదా అని ప్రశ్నించారు. సనాతన ధర్మం గురించి సొంత కూతురిని ఒప్పించలేని పవన్ సమాజాన్ని ఎలా ఒప్పిస్తాడని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం చెత్త పన్నును రద్దు చేయ డం సంతోషమన్నారు. ఆ సాకుతో రాష్ట్రాన్ని చెత్త ఆంధ్రప్రదేశ్ చేయవద్దని సూచించారు. చంద్రబాబు 110 రోజుల పాలనలో రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసిందని పేర్కొన్నారు. ఈ 110 రోజుల్లోనే 2 సార్లు ఎపిడెమిక్స్ వచ్చా యని తెలిపారు. ఒకసారి డయేరియా, ఎపిడెమిక్, మరొక సారి డెంగీ, మలే రియా ఎపిడెమిక్‌తో అనేక మంది చనిపోయారని తెలి పారు. గ్రీన్ అంబా సిడర్ల జాడ లేదన్నారు. 2029 నాటికి రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ చేస్తానని ముఖ్యమంత్రి చెప్పడం శోచనీయమన్నారు. వట్టి మా టలు కట్టిపెట్టి చేతల్లో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు కృషి చేయాలని తులసిరెడ్డి సూచించారు.

బాధితులకు నష్టపరిహారం ప్రకటించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కన్నెలూరు, నేతాజీ నగర్‌లో కలుషిత నీరుతాగి అనారోగ్యం పాలైనవారికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, నాయకులు విజయ్, వినయ్ డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని గురువారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ నీరు కలుషితం అవుతున్నాయని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సకాలంలో అధికారుల స్పందించకపోవడంతోనే ఈ ఘోరం జరిగిందన్నారు. అధికారులు నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులకు ధైర్యం చెప్పి భరోసా కల్పించాలని సిపిఎం నాయకులు వైద్యులను కోరారు. అస్వస్థకు గురైన వారిని ఇతర ప్రయివేట్ ఆస్పత్రులకు పంపకుండా వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. డిఎంహెచ్ఒ రోగుల ఆరోగ్యం పట్ల సమీక్షించాలని కోరుతున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నరేంద్ర, మన్సూర్, బీమా, సవుర్, బాషా పాల్గొన్నారు.

ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

విమర్శనాత్మకంగా చేస్తే స్వీకరిస్తాం

- అక్రమ మైనింగ్‌కు టిడిపి అడ్డుకట్ట వేసింది : బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శలు విమర్శనాత్మకంగా చేస్తే స్వీకరిస్తామని, అలాకాకుండా మీకిష్టమొచ్చినట్లు మాట్లాడడం సబబు కాదని టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు శాంతి భద్రతలపై ప్రత్యేకదృష్టి పెట్టారన్నారు. కానీ ఎంపీ శాంతిభద్రతలకు సంబంధించి విమర్శలు చేయడం సరిలేదన్నారు. వైసిపి ప్రభు త్వం ఉన్నప్పుడు కంటే ప్రస్తుతం ఎంతో బాగుందని తెలిపారు. పులి వెందులలో అనేక దాడులకు సృష్టికర్తలు మీరు కాదా అని ప్రశ్నించారు. కొన్ని మైనింగ్‌ల్లో మీ తండ్రికి, మీకు సంబంధించిన వ్యక్తులకు పర్సంటేజీలు లేవా అని ఆయన ప్రశ్నిం చారు. వేముల మండలంలో జిలెటిన్ స్టిక్స్‌కు సంబంధించిన ఘ టన బాధా కరమన్నారు. అక్రమ మైనింగ్‌కు సంబంధించి కూటమి ప్రభు త్వం వచ్చిన వెం టనే అడ్డుకట్ట వేసిందని తెలిపారు. ప్రస్తుతానికి పులివెందుల నియో జకవర్గంలో లైసెన్స్ ఉన్నవారే నడుపుతున్నారని వివరించారు. పులివెందులలో మట్కా మా ప్రభుత్వం వచ్చిన వెంటనే పూర్తిగా అరికట్టామని బిటెక్ రవి గుర్తు చేశారు. పులివెందులలో ఎంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న వీరు సిసి కెమె రాలను మీ ప్రభుత్వంలో ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారని ప్రశ్నించారు.

నిబంధనల మేరకే ధరలు వసూలు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

దసరా పండుగ నిర్వహణలో రెండవ మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో ఎగ్జిబిషన్‌కు కూడా అంతే గొప్పపేరుందని, ఈ ఎగ్జిబిషన్‌లో నిబంధనల మేరకు మాత్రమే ధరలు వసూలు చేయాలని కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో రాచమల్లు ప్రసాదరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రెండు పర్యాయాలు ఎగ్జిబిషన్‌కు ప్రవేశ రుసుం ఉచితంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ రుసుం చెల్లించేది లేనందున జిఎస్‌టి మాత్రం చెల్లించలేదని, టిడిపి నాయకులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. టిడిపి అధికారంలోకొచ్చాక ఎగ్జిబిషన్ మొదటిసారిగా నిర్వహిస్తున్నారని నిబంధనల మేరకే ధరలు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సారి టిడిపి నాయకులు గుత్తేదారుగా ఉన్నారన్నారు. 2014-19లో టిడిపి హయాంలో ఎగ్జిబిషన్ గుత్తేదారులు బకాయిపడిన విషయం గమనించాలన్నారు. పట్టణంలోని ఏ పార్కులో కూడా ప్రవేశ రుసుం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ ఈ ధరల అమలు విషయంలో చట్టం మేరకు వ్యవహరించాలన్నారు. ఇక చంద్రబాబు పాలన విషయానికొస్తే ఇచ్చిన హామీలు తుంగలో తొక్కుతున్నారన్నారు. పెంచబోమని హామీ ఇచ్చిన విద్యుత్ ఛార్జీలు పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. నిత్యాసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. చెత్తపన్ను రద్దు చేసినప్పటికీ ఆ మొత్తం నేరుగా ప్రభుత్వమే మున్సిపాల్టీలకు చెల్లించేలా ఉండాలని, మున్సిపల్ జనరల్ నిధుల నుండి కూడదని తెలిపారు. ఈ వంద రోజుల్లో టిడిపి ప్రభుత్వం రూ.27వేల కోట్లు అప్పు చేసిందన్నారు. ప్రజలు గత పాలనను ప్రస్తుత పాలనను నిశితంగా గమనిస్తున్నారని వంశీధర్‌రెడ్డి అన్నారు.

దసరా ఉత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం శ్రీ వెంకటేశ్వర, చౌడేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర ఆలయంలో స్వామివారికి పట్టు వస్త్రాలను మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి మారెడ్డి లతారెడ్డి సమర్పించారు. ఆమెకు వేద పండితులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల ఆకాంక్షలు, అభిమతానికి అనుగుణంగా ఏర్పడిన నూతన ప్రభుత్వం 12వ పిఆర్‌సి అమలులో భాగంగా మధ్యంతర భృతిని ఈ దసరా పండుగకు ప్రకటించాలని ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో గురువారం ఎస్‌టియు ప్రాంతీయ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమం ఎస్‌టియు రీజియన్ కన్వీనర్ ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రశాంత వాతావరణంలో బోధన అభ్యసన ప్రక్రియలో ఉపాధ్యాయుడు నిమగ్నం అయ్యేలా, బోధనేతర పనులకు స్వస్తి పలకాలన్నారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు ప్రాంత జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు, సంఘంలో వివిధ పదవులు పొందిన వారికి ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, బాల గంగిరెడ్డి, రషీద్‌ఖాన్, సీనియర్ నాయకులు గురుకుమార్, కుండా భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్, రాష్ట్ర కమిటీ కన్వీనర్లు సుబ్రహ్మణ్యం, శివారెడ్డి, వివిధ మండలాల అధ్యక్షప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సమాజంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధికి పాటుపడుతున్న స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమని సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలంటే స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సేవలు అందించాలని ఇచ్చిన పిలుపు మేరకు మొదటిసారి స్పందించి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్‌బ్యాంక్ విభాగానికి రెండు ఎసిలు, వైద్యుల సౌకర్యార్థం రెండు బెంచీలను గురువారం ఆ సంస్థ వితరణ చేసింది. ఈ సందర్భంగా ఒంటేరు మాట్లాడుతూ సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఎన్నో ఏళ్లుగా వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటోందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ కుండా నాగరాజు పాల్గొన్నారు.

వితరణ చేస్తున్న సంస్థ సభ్యులు